ఈనెల 21న దేవస్థానం భూములు కౌలుకు ఇచ్చే టెండర్లు

విశాలాంధ్ర-జలుమూరు : మండలం శ్రీముఖలింగం దేవస్థాన భూముల కౌలు రైతుల కోసం 2025-26 నుండి 2027-28 సంవత్సరం వరకు కౌలకు ఇచ్చుటకు టెండర్ మరియు బహిరంగ వేలం పాట ఈనెల 21 ఉదయం 10 గంటలకు దేవాదాయ శాఖ కార్యాలయం ఆవరణలో జరుగుతుందని కార్యనిర్వాహణాధకారి పి ప్రభాకర్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు బిట్టు ఒక్కంటికి లక్ష రూపాయలు సాల్వెంట్ సర్టిఫికెట్ 30 వేల రూపాయల ప్రథమ ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొన వచ్చునని అన్నారు.

ప్రాంతీయ చైతన్యానికి ఆచార్య చలం ఆదర్శం

'చందు' అవార్డు గ్రహీత నల్లి ధర్మారావు

విశాలాంధ్ర-శ్రీకాకుళం : ప్రాంతీయ చైతన్యానికి, జ్ఞానానికి ఆచార్య కె ఎస్ చలం తనకు స్ఫూర్తి, ఆదర్శమని ప్రముఖ కవి, రచయిత, జర్నలిస్ట్ నల్లి ధర్మారావు చెప్పారు. ఈనెల 18న విశాఖలో ఆచార్య చందు సుబ్బారావు లిటరరీ అండ్ కల్చరల్ ట్రస్ట్ అవార్డును అందుకోబోతున్న సందర్భంగా, తనను కలిసిన మీడియా ప్రతినిధులతో ధర్మారావు మాట్లాడారు. 62 ఏళ్ల జీవితంలో, 40 ఏళ్ల నుంచి జర్నలిజం వృత్తిలో కొనసాగుతూ, దానికి సమాంతరంగా సాహిత్య రంగంలోనూ ఆయన కృషి కొనసాగుతోంది. ప్రత్యేకంగా, కళింగాంధ్ర చరిత్ర, సంస్కృతి, వెనుకబాటుతనం కోసం చేసిన పరిశోధనలు, పరిశీలనలు మీడియా, ఇతర వేదికల ద్వారా ఆయన ప్రకటించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆర్థిక శాస్త్ర విభాగం అధిపతిగా ఉంటూ, ఆచార్యకేశలం కన్వీనర్ గా ప్రారంభించిన ఉత్తరాంధ్ర అధ్యయన వేదికకు ధర్మారావును కో కన్వీనర్ గా నియమించారు. ఆనాటి నుంచి తనకు ప్రాంతీయ స్పృహ, అస్తిత్వం గురించి ఆలోచనలు ప్రారంభమైనట్టు ఆయన చెప్పారు. కవిగా, రచయితగా తనను తీర్చిదిద్దింది కమ్యూనిస్ట్ భావజాలమైనా, మన ప్రాంతం గురించి మనమెందుకు ఆలోచించడం లేదనే ప్రశ్న, ఆచార్య చలం వల్లనే ఎదురైందన్నారు. కళింగాంధ్ర చారిత్రక వైభవం, పరిశోధకులు పట్టించుకోని వైనం, విశాఖ నగరం తప్ప మిగిలిన ప్రాంత వెనుకబాటుతనం, ఇక్కడ పుట్టిన మహనీయులు, వారి కృషి, త్యాగాలు- ఇవన్నీ తెలుసుకోవాలని, సమాజానికి తెలియజేయాలనే ఆరాటం తనలో ఆలస్యంగా ప్రారంభమైందని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా, జర్నలిజం వృత్తిలో కొనసాగుతూ చాలావరకు ఆరాటాన్ని సఫలం చేసుకున్నానని చెప్పారు. భారత జర్నలిస్టు ఉద్యమ పితామహుడు మానుకొండ చలపతిరావు, తెలుగు వాడుక భాష ఉద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు, భారత ఆధునిక సర్కస్ పితామహుడు కోడి రామమూర్తి నాయుడుల జన్మ స్థలాల గురించి, పూర్వ శ్రీకాకుళం జిల్లాలో వారి జీవితాల గురించి ఎంతోమందికి తెలియని వాస్తవాలను వెలుగులోకి తీసుకు రాగలిగానని చెప్పారు. ఈ కృషికి తన జర్నలిస్టు వృత్తి జీవితం ప్రధానంగా సహకరించిందని, కొంతమంది కలెక్టర్లు, జిల్లా అధికారులు కూడా అండదండలందించారని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. పార్ట్ టైం విలేకరిగా వృత్తి జీవితం ప్రారంభించి, ఉత్తరాంధ్ర ప్రత్యేక ప్రతినిధి వరకు ఆ ప్రయాణం కొనసాగిందని, అందుకు అవకాశం ఇచ్చిన వివిధ పత్రికల యాజమాన్యాల సహకారాన్ని కూడా తలుచుకున్నారు.

శ్రీకాకుళం జిల్లా వెనుకబాటు తనం కోసం ఆలోచన ఆచార్యచలం వల్ల ప్రారంభమైతే, దీనికోసం ఏదో ఒక రూపంలో ఉద్యమించాలనే ఆలోచన సిపిఐ సీనియర్ నాయకులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు గారి వల్ల కలిగిందని ధర్మారావు చెప్పారు. జిల్లా అభివృద్ధి వేదిక స్థాపించి, ఆ దిశగా పనిచేయాలని నాగేశ్వరరావు చెప్పినట్టు తెలిపారు. సిక్కోలు జల సాధన సమితి పేరుతో, సాగునీటి జలాల సమస్యలపై ఎన్నో కార్యక్రమాలు చేస్తూ, జిల్లా వెనుకబాటుతనంపై ఒక చర్చను లేవదీస్తూ, జిల్లాల పునర్విభజన సందర్భంలో ప్రతి ఎంపీ స్థానాన్ని ఒక జిల్లాగా మార్చాలనే నిర్ణయం జగన్ ప్రభుత్వం తీసుకున్నప్పుడు, ఎచ్చెర్ల నియోజకవర్గాన్ని విజయనగరంలో విలీనం చేయకుండా అడ్డుకోగలిగామని సంతృప్తి వ్యక్తం చేశారు. ఎచ్చెర్లను కోల్పోతే, శ్రీకాకుళం జిల్లా ఎంత నష్టపోతుందనే సమాచారాన్ని ఒక బుక్లెట్ ద్వారా ప్రకటించి, ఆనాటి అధికార రాజకీయ వర్గాల మీద ఒత్తిడి తీసుకురావడం వల్లనే అది జరిగిందన్నారు. కళింగాంధ్ర చరిత్ర, సంస్కృతి గురించి ఒక గ్రంథం రాయాలన్నది దివంగత కారా మాస్టారుతో పాటు చాలామంది మిత్రుల కోరికని చెబుతూ, దీనికి కూడా ఆచార్య చలం ప్రేరణ అన్నారు. అభ్యుదయ, ఆధునిక రచయిత, విమర్శకులు చందు సుబ్బారావు అవార్డుకు తనను ఎంపిక చేయడం పట్ల ధర్మారావు ఆనందం వ్యక్తం చేశారు. ఇది తన కృషికి ఎంతో ఉత్సాహం, ప్రోత్సాహం అందిస్తుందని ధన్యవాదాలు తెలిపారు.

ఉపాధ్యాయ బదిలీల్లో ఖాళీలు బ్లాక్ చేయడం దుర్మార్గం

- ఎస్టీయు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్వీ రమణమూర్తి, జి.రమణ

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : విద్యాశాఖ ఉన్నతాధికారులు ఉపాధ్యాయ సంఘాలతో జరిగిన సమావేశంలో వెంటనే డీఎస్సీ ఉండడం వలన బదిలీ కౌన్సలింగ్‌లో ఖాళీలు బ్లాక్ చేయమంటూ చెప్పి ఇప్పుడు బ్లాక్ చెయ్యడం దుర్మార్గమని ఎస్టీయు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్వీ రమణమూర్తి, జి.రమణలు అన్నారు. ఈమేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పోస్టులు బ్లాక్ చేయాల్సిన అవసరం కూడా లేదని అధికారులు పదేపదే చెప్పడం జరిగిందని, అందుకు విరుద్ధంగా నేడు ఉపాధ్యాయ బదిలీల కౌన్సలింగ్‌లో పోస్టులు బ్లాక్ చేసేవిధంగా ప్రాథమిక మార్గదర్శకాలు విడుదల చేశారన్నారు. మొత్తం మంజూరైన పోస్టుల నుంచి పనిచేస్తున్న పోస్టుల్ని తీసివేయగా మిగిలి ఉన్న ఖాళీలన్నింటినీ బ్లాక్ చేస్తున్నారని ఇది అన్యాయం అని పోస్టు బ్లాక్ చేయడం మానుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ప్రభుత్వం చేస్తున్న మార్పులు కారణంగా ఎక్కువమంది ఉపాధ్యాయులు రీఅపోర్షన్ కు గురిఅవుతున్నారని, జిల్లాలో కనీసంగా అన్ని క్యాడర్ల కలిపి 500 మంది వరకు ఉపాధ్యాయులు మిగులు ఉండే పరిస్థితులు ఉన్నాయన్నారు. అలాంటప్పుడు ఉన్న ఖాళీలను బ్లాక్ చేయవలసిన అవసరమేమిటో అధికారులు చెప్పాలని ప్రశ్నించారు. ఆగస్టు నాటికే 2025 డీఎస్సీ ఉపాధ్యాయులు అందుబాటులోకి రానున్నారని, ఒక్క పోస్టు బ్లాక్ చేయకుండా ఉపాధ్యాయులు బదిలీల కౌన్సిలింగ్లో అన్ని ఖాళీలను అందుబాటులో ఉంచాలని ప్రభుత్వానికి ప్రకటనలో డిమాండ్ చేశారు.

బుద్ధుని స్ఫూర్తి... విశ్వశాంతికి దిక్సూచి

- గాంధీ మందిరంలో గౌతమబుద్ధుని జయంతి వేడుకలు

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్ : శాంతిని ప్రబోధించి మానవ వికాసానికి దోహదపడిన గౌతమబుద్ధిని స్ఫూర్తి విశ్వశాంతికి దిక్సూచిగా నిలుస్తుందని వక్తలు పేర్కొన్నారు. ప్రపంచం ఎన్ని రంగాల్లో ఉన్నత స్థితికి చేరినప్పటికీ బుద్ధిని శాంతి మంత్రం సజీవంగా ఉంటుందన్నారు. గౌతమబుద్ధిని జయంతి సందర్భంగా మంగళవారం నగరంలోని శాంతినగర్ కాలనీలోని గాంధీ మందిరంలో బుద్ధుని విగ్రహ దాతలు కె.వి.వి.ఎస్. వర్మతో పాటు నిర్వాహకులు ప్రొఫెసర్ విష్ణుమూర్తి, డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, బొడ్డేపల్లి దామోదరరావు, పందిరి అప్పారావు బృందం పూలమాలలు వేశారు. అలాగే జేసీస్ ప్రతినిధులు అనీల్, బెందాళం వరలక్ష్మి, తమ్మినేని ఉషారాణి బుద్ధుడికి నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా బుద్ధుడి బోధనలు ఎందరినో ప్రభావితం చేశాయన్నారు. బుద్ధుడు చూపించిన మార్గంలో తమ జీవనాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు మహనీయులందరూ ముందడుగు వేశారన్నారు. ప్రపంచ మేథావిగా గుర్తింపు పొందిన భారతరత్న బాబాసాహెబ్ అంబేద్కర్ బుద్ధుడి బోధనలతో ప్రభావితం అయ్యారని, అంతటి గొప్ప శక్తి బుద్ధుడు చూపించిన మార్గానికి ఉందన్నారు. బుద్ధం శరణం గచ్ఛామి అంటూ కీర్తనలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో గాంధీ మందిర ప్రతినిధులు బరాటం లక్ష్మణరావు, కె.అప్పారావు, పెంకి చైతన్యకుమార్, శాస్త్రి తదితరులున్నారు.

శరవేగంగా వంశధార కుడికాలువ పూడికతీతలు

విధాలాంధ్ర-సరుబుజ్జిలి : మండలం మీదుగా ప్రవహిస్తున్న వంశధార కుడికాలువ పూడిక తీతలు ప్రారంభించారు. ఈ వేసవిలో రైతుల వినతి మేరకు పూడికలు, గుర్రపు డెక్కతొలిగించడం చేయాలనీ నిర్ణయించారు. అన్నమాట ప్రకారం కూటమి ప్రభుత్వం సెరవేగంగా పూడికతీతలు ప్రారంభించారు. ఇచ్చిన మాట ప్రకారం స్థానిక ఎమ్మెల్యే, పి యు సి చైర్మెన్ కూన రవికుమార్ పూడిక తీతలు పై దృష్టి పెట్టడం హర్షణీమని స్థానికులు మరియు వంశధార పరివాహక రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వంశధార కుడికాలువకు సబ్ కనెల్ అయిన యారాగం కెనాలా పైన దృష్టి సరించాలని, కాలువలో పూడిక పేరుకుపోవటంతో చిన్న కాగితాపెల్లి, బుడ్డీవలస, మూల సవలాపురం, తురకపేట రైతులు సుమారు 1000 ఎకరాలు ముంపుకు గురి అవుతుందని యారాగం కెనాల్ పైన దృష్టి సరించాలని కోరుతున్నారు.

క్యాన్సర్ బాధితునికి రూ.10 వేలు వితరణ

- రోగిని ఆదుకోండి దాతలారా...

విశాలాంధ్ర-హిరమండలం : మండలకేంద్రం హిరమండలం గాంధీనగర్ వీధికి చెందిన బుట్టలు తయారు చేసి జీవనోపాధి సాగిస్తున్న గొడగల ఆదినారాయణ ఇటీవల కొంత కాలంనుంచి తీవ్రమైన క్యాన్సర్ అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఇటీవలే తన ఇంటికి వచ్చిన ఆదినారాయణ నిహిర మండలం హెల్పింగ్ హేండ్స్ వ్యవస్థాపకులు మాజీసైనిక ఉద్యోగి డా.పోతురాజు.శ్రీధర్ తనవంతు సాయంగా, ఔదార్యంగా 5000/- రూపాయలను మరియు హిరమండలం గాంధీనగర్ ఎంఆర్‌పిఎస్ యువజన సంఘం అధ్యక్షులు .కంటి.త్రినాధరావు ఎం ఆర్ పి ఎస్ కార్యకర్తలు, హిరమండలం ఎంఈఎఫ్ సభ్యులు తమ వంతు సాయంగా మరొక 5000/- రూపాయలను మొత్తంగా అక్షరాల 10వేల రూపాయలను తక్షణ సాయంగా మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా కంటి. త్రినాధరావు మాదిగ మాట్లాడుతూ కష్టాలులో ఉన్నవారికి...మా గాంధీనగర్ యువజన సంఘం ఎల్లపుడూ.. తమ ఔదార్యం చాటుకుంటూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తారని చెప్పారు. వీరు చేసిన సహాయానికి గొడగల ఆదినారాయణ కుటుంబ సభ్యులు ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు. సహృదయం గల దాతలు.. ఈసందర్భంగా ఆదినారాయణ కుటుంబాన్ని ఆర్థికంగా.. వైద్యపరంగాదాతలు ఆదుకోవాలని మనవి చేశారు. ఈ మహ త్తర కార్యక్రమం లో పాల్గొన్న ప్రతి సభ్యుడికి మా హృదయ పూర్వక ధన్యవాదములు తెలియిజేస్తున్నమన్నారు.

స్వర్గధామం మండప ప్రారంభం

విశాలాంధ్ర-సోంపేట/కంచిలి : కంచిలి మండలం బొనమాలి గ్రామంలో మండల పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధులు 4లక్షలతో నిర్మించిన స్వర్గధామ మండపాన్ని ఎంపీపీ పైల దేవదాసురెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఇటువంటి అభివృద్ధి కార్యక్రమం చేపట్టడం పట్ల సర్పంచ్ గనప సింహాచలంతో పాటు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఎంపీపీ దేవదాసురెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో లడ్డుకేశవపాత్రో, దుర్గాశి ధర్మారావు, కొనపల సురేష్, తలగాన తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలో సత్తాచాటిన పైల కీర్తన

విశాలాంధ్ర-మందస : ఇటీవల విడుదలైన డా.బి.ఆర్ అంబేద్కర్ గురుకులాల కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఇంటర్ విభాగం)లో కొత్తపల్లి ఉన్నత పాఠశాల నుండి 10వ తరగతి పూర్తి చేసుకున్న పైల.కీర్తన రాష్ట్ర స్థాయిలో 31 వ ర్యాంక్ సాధించిందని పాఠశాల ప్రధానోపాధ్యా యులు ఎస్. గణేశ్వరరావు తెలిపారు. కామన్ ఎంట్రన్స్ టెస్ట్ లో 1/3 వంతు నెగిటివ్ మార్కులు ఉన్నప్పటికీ కీర్తన మొత్తం 100 మార్కులకు గాను 82 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబర్చడంపట్ల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు పాఠశాల సిబ్బంది, మంగళవారం కీర్తనను ప్రత్యేకంగా అభినం దించారు. యస్ యస్ సీ ఫలితాల్లో కూడా కీర్తన 590 మార్కులతో సత్తా చాటింది. అభినందన కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి. భీమారావు, యం. లక్ష్మణరావు, యస్. కిరణ్ కుమార్,యస్. అబ్రహం, పి. రాంబాబు, యం. చిత్రసేను, యం. దామోదరం, జి. గోపాలకృష్ణ, బి. రమేష్ మరియు స్థానిక పెద్దలు, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మురళీనాయక్‌కు ఘన నివాళులు



విశాలాంధ్ర-సోంపేట : భారత్ పాక్ యుద్ధంలో మన రాష్ట్రానికి చెందిన మురళీనాయక్ అమరవీరుడుగా మృతి చెందిన నేపథ్యంలో సోంపేట పట్టణ శివారున చిన్నపల్లివీధి వద్ద సోమవారం రాత్రి ఘనంగా నివాళులు అర్పించారు. చిన్నపల్లివీధి యువత, వియ్‌ఫర్‌యు స్వచ్ఛంద సంస్థ, జనసేన పార్టీ కార్యకర్తలు ఆధ్వర్యంలో జరిగిన కొవ్వొత్తుల ర్యాలీలో ఎస్సై లొవరాజు కూడా పాల్గొని నివాళులు అర్పించారు.

వీధి వ్యాపారులు తమ వివరాలు నమోదు చేసుకోవాలి

- కమిషనరు పి.వి.వి.డి ప్రసాదరావు

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : పట్టణ వీధి వ్యాపారుల పాలసీలో భాగంగా నగరపాలక సంస్థ పరిధిలో వీధివ్యాపారం చేస్తున్నవారు తప్పనిసరిగా వివరాలు నమోదు చేసుకోవాలని కమిషనరు పి.వి.వి.డి ప్రసాదరావు సూచించారు. ఈమేరకు మంగళవారం వార్డు సచివాలయ సంక్షేమ కార్యదర్శులకు, మెప్మా ఆర్పీలకు నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో వీధివ్యాపారం చేస్తున్న స్థానిక, స్థానికేతరులు తమ వివరాలు సర్వే సిబ్బందికి అందివ్వాలని తెలిపారు. సర్వే సమాచార సేకరణపై ఎటువంటి అపోహలు చెందాల్సిన అవసరంలేదన్నారు. భవిష్యత్తులో వీధి వ్యాపారుల సుస్థిరతకు ప్రభుత్వం చేపట్టే విధానపరమైన నిర్ణయాలు పొందేందుకు వీలవుతుందన్నారు. ఈ నెల 20 వ తేదీలోగా సమాచార సేకరణ, ఆన్లైన్ ప్రక్రియ ముగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మెప్మా సిటీ మిషన్ మేనేజర్ ఎస్ వెంకటరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి లక్ష్యాలను పూర్తి చేయాలి : ఏపీడి సిహెచ్.శ్రీనివాసరెడ్డి

విశాలాంధ్ర-కవిటి: కవిటి మండలంలో ఉపాధి లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని ఏపీడి సిహెచ్. శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన కవిటి మండలంలో ఇద్దివానిపాలెంలో జరుగు తున్న ఉపాధి పనుల పరిశీ లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు 4 వేల పనిదినాలను పూర్తి చేశారని ఈ వారంలో మరో 4 వేల పని దినాలను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఏపీవో టి. మోహనరావు, టీఏలు బి. శ్యామసుందర్, కితరో దోళాయి, ముద్దపు దివ్య తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు సత్కారం

విశాలాంధ్ర-కవిటి : మండలంలోని ముత్యాలపేట గ్రామంలో వెలసి ఉన్న శ్రీ అమృత వర్షిని సమేత శ్రీ మృత్యుంజయశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టిన అనంతరం శ్రీ వెంకటేశ్వర మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ కళాబృందం మాస్టర్ చిన్నా గురు స్వామి బృందంచే సంగీత విభావరి కార్యక్రమం చేపట్టారు. పద కవితా పితామహులు శ్రీతాళ్లపాక అన్నమాచార్యుల జయంతి సందర్భంగా ఏర్పాటుచేసిన సంగీత విభావరి అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో భాగంగా శ్రీ వెంకటేశ్వర మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ కళాబృందం మాస్టర్ చిన్నా గురు స్వామి బృందం అనపాన మణికుమారి, హేమంత్ కుమార్, బాడిత్య నిత్యానంద పాల్గొని పలు అన్నమయ్య సంకీర్తనలు, రామదాసు కీర్తనలు, శివ కీర్తనలతో చేసిన గానం అందరిని అలరించాయి. ఈసందర్భంగా కళాకారులకు ఆలయ కమిటీవారు ఘనంగా సత్క రించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చంద్రశేఖర్ మాస్టర్, ఆలయ కమిటీ సభ్యులు ఆరంగి శివాజీ, వెంకటరావు, ఆలయ కమిటీసభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల చిన్నారులకు ఇంటింటా సర్వే

విశాలాంధ్ర-కవిటి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమగ్ర శిక్ష ద్వారా 0 నుండి 18 సంవత్సరాల వయసు గల ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల ఇంటింటి సర్వే చేపట్టారు. కవిటి మండలంలోని అన్ని గ్రామాలలో ఈనెల 13వ తేదీ నుండి జూన్ 9వ తేదీ వరకు ఈ సర్వే నిర్వహిస్తున్నట్లు కవిటి మండల విద్యాశాఖ అధికారి ధనుంజయ మజ్జి తెలిపారు. సమగ్ర శిక్ష పథకం ద్వారా ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు గత విద్యా సంవత్సరంలో ట్రాన్స్పోర్ట్ అలవెన్సు, ఎస్కార్ట్ అలవెన్స్ రూ.3 వేలు, అలాగే ప్రతి శనివారం రిసోర్స్ పర్సన్స్ ద్వారా గృహ ఆధారిత విద్య మరియు ప్రత్యేక అవసరాలు గల 0 నుండి 18 సంవత్సరాలు వయసు గల అమ్మాయిలకు ప్రత్యేకంగా గర్ల్స్ స్టయిఫండ్ (సంవత్సరానికి రూ. 2వేలు)ఎంఈఓ ధనుంజయ మధ్య చేతుల మీదుగా అందజేశారు. ఈ సర్వేలో 0నుంచి 18 సంవత్సరాల లోపు వయసు గల ప్రత్యేక అవసరాలు గల పిల్లలు అనగా వినికిడి లోపం, దృష్టిలోపం, ఆటిజం మానసిక సమస్యలు,మాట్లాడలేకపోవడం, రక్తహీనత వంటి 21రకాల వైకల్యాలను గుర్తించి వారిని సమీప పాఠశాలలో చేర్పించి వారికి ప్రభుత్వం ద్వారా సౌకర్యాలను,ఉపకరణాలు అవసరమైన వారికి చెవిటి మిషన్లు,మూడు చక్రాల సైకిళ్లు,కళ్లద్దాలు వంటి వాటిని అందించడం జరుగుతుందని తెలిపారు.కావున గ్రామాల్లో ఉండే ప్రత్యేక అవసరాలు గల పిల్లలు గురించి సమాచారం తెలిసినవారు ఎవరైనా సహిత విద్యా ఉపాధ్యాయులు లమ్మత కృష్ణారావు, అరుణ్ కుమార్ లను 8247393043, 9391164018 నంబర్లకు ఫోన్ ద్వారా సంప్రదించి సమాచారం అందజేయాలని మండల విద్యాశాఖ అధికారి ధనుంజయ మజ్జి కోరారు. ప్రత్యేక అవసరాల చిన్నారుల సర్వే మండలంలోని కళింగపట్నం అంగన్వాడి కార్యాలయంలో నిర్వహించినట్లు సాహిత్య విద్య ఉపాధ్యాయులు అరుణ్ కుమార్ తెలిపారు.

క్రీడలను వృత్తిగా స్వీకరించండి

విశాలాంధ్ర-కవిటి: విద్యార్థులు క్రీడలను వృత్తిగా స్వీకరించాలని జిల్లా క్రీడల అభివృద్ధి జూనియర్ అసిస్టెంటు మాదిన రాంబాబు అన్నారు. ఈ మేరకు మంగళవారం బి. గొనపపుట్టుగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం బాబురావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేసవి క్రీడా శిబిరంలో మదన రాంబాబు పాల్గొని మాట్లాడారు. ఈ నెల రోజుల పాటు నిర్వహించే శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందులో శిక్షకులు ఇచ్చే శిక్షణను పూర్తిస్థాయిలో స్వీకరించి ముందుకు వెళ్లాలని కోరారు. అంతేకాకుండా క్రీడలు అనేవి మీ జీవితంలో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత కూడా ఇస్తాయని, ప్రతిరోజు మీ తీసుకునే ఈ శిక్షణ జీవితంలో ఎంతగానో ఉపయోగ పడుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పొందల ప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయులు బల్లెడ రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

అత్యవసర, ప్రమాద సమయంలో అప్రమత్తంగా ఉండాలి

- ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో మాక్ డ్రిల్

- జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రజలకు పిలుపు

విశాలాంధ్ర-శ్రీకాకుళం : అత్యవసర, ప్రమాద సమయంలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆర్టీసీ కాంప్లెక్స్ లో మంగళవారం రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, ఎపి స్టేట్ డిజాస్టర్ మేనేజ్ మెంట్, తదితర శాఖలు సంయుక్తంగా మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉగ్రవాదులు, బాంబు పేలుడు,ఇతర దేశాల నుండి దాడి, జరిగితే ఏమి చేయాలి అనే అంశంపై మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. కలెక్టరేట్ లో ఉన్న కంట్రోల్ రూంకు ప్రమాదం పై కలెక్టరేట్ కు సమాచారం ఇస్తే అక్కడ నుండి పోలీసు, వైద్య ఆరోగ్య శాఖ, సివిల్ డిఫెన్స్, ఎపి స్టేట్ డిజాస్టర్ మేనేజ్ మెంట్, తదితర శాఖలు ప్రమాద స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టడం జరుగుతోందన్నారు. ఈ మాక్ డ్రిల్ లో 300 మంది పాల్గొనగా 35 మంది తీవ్రంగా గాయపడగా 4 మంది మృతి చెందారని, 15 మంది ప్రాణాపాయ స్థితిలో ఉన్నట్లు చెప్పారు. ప్రమాదాల సమయంలో ప్రజలకు ఏ విధమైన సమస్య లేకుండా తగు చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. ఏ శాఖకు సంబంధించిన పనులను ఆ శాఖలు పూర్తి స్థాయిలో విధులు నిర్వహించనున్నట్లు వివరించారు. రహదారులు మరియు భవనాలు శాఖ రోడ్లు క్లియర్ చేయడం, పైడి భీమవరం వద్ద గల ఫార్మా కంపెనీలు గ్రామస్తులను అప్రమత్తత చేయు నిమిత్తం సైరన్ మ్రోగిస్తారని చెప్పారు. పలాసలో రైల్వే స్టేషన్ లో ప్రజలను అప్రమత్తం చేస్తామన్నారు. భవిష్యత్తులో ఏ విధంగా ప్రమాదాలు సంభవించినా సహాయక కార్యక్రమాలు చేయడం జరుగుతుందని వెల్లడించారు.

- అత్యవసర పరిస్థితులపై ప్రజలకు అవగాహన కల్పించడమే ఈ మాక్ డ్రిల్ ముఖ్య ఉద్దేశం... జిల్లా ఎస్పీ కెవి మహేశ్వరరెడ్డి

ఇప్పటికే ఆమదాలవలస, పలాస రైల్వే స్టేషన్లో ప్రజలకు అత్యవసర, విపత్కర పరిస్థితులలో ఉగ్రవాద దాడులు జరిగినప్పుడు ఏ విధంగా స్వీయ రక్షణ పొందడం, పోలీసు, రెవిన్యూ, అగ్ని మాపక శాఖల వంటి ప్రభుత్వ విభాగాలు సహాయక చర్యలు చేపడతాయని ప్రజలకు అవగాహన కల్పించడమే ఈ సివిల్ మాక్ డ్రిల్ యొక్క ముఖ్య ఉద్దేశమని జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి పేర్కొన్నారు. ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ లో ఉగ్రవాదుల దాడులు, పేలుడు పదార్థాలు ఉన్నాయని సమాచారం మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉన్న కంట్రోల్ రూమ్ కి వచ్చిన సమాచారం మేరకు జిల్లాలో వివిధ విభాగాలు ఏ విధంగా తక్షణ స్పందించి ఘటన స్థలానికి చేరుకొని ప్రజల రక్షణ, నియంత్రణ చర్యలు ఏ విధంగా తీసుకోవడం జరుగుతుందని ఈ సివిల్ మాక్ డ్రిల్ రూపంలో నిర్వహించడం జరిగిందన్నారు. ఇందులో చిన్న చిన్న లోపాలు జిల్లా కలెక్టర్ తో పాటు తాను గుర్తించడం జరిగిందని లోపాలు సరిదిద్ది మరికొన్ని చోట్ల ఇలాంటి మాక్ డ్రిల్ కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. దేశ సరిహద్దుల్లో నెలకొన్న యుద్ధ వాతావరణం నేపథ్యంలో జిల్లాలో ఉగ్రవాదులు దాడులు జరిగినప్పుడు సమీపాన పౌరులు తమకు తాము ఏ విధంగా స్వీయ రక్షణ పొందాలి ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టాలి ఉగ్రవాదులను ఎలా ఎదుర్కోవాలి అనే అంశాలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు మేరకు ఈ సివిల్ మాక్ డ్రిల్ ను నిర్వహించి ప్రయాణికులు, స్థానిక ప్రజలకు అవగాహన కల్పించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కె. సాయి ప్రత్యూష, మునిసిపల్ కమిషనర్ ప్రసాద్ రావు, డిఎస్పీ సిహెచ్ వివేకానంద, ఎఆర్ డిఎస్పీ శేషాద్రి, జిల్లా అగ్నిమాపక అధికారి మోహనరావు, ఆర్టీసీ ఆర్ఎం విజయ్ కుమార్, ఎపి స్టేట్ ఆర్డీ ఎఫ్, రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, తదితర శాఖలు మాక్ డ్రిల్ లో పాల్గొన్నాయి.

వైసీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు కళ్యాణికి సత్కారం

విశాలాంధ్ర-రణస్థలం: తాడేపల్లి క్యాంప్ ఆఫీసులో వైసీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు వరుదు కళ్యాణి ఎమ్మెల్సీ వారి ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి మహిళా విభాగ మీటింగు మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎచ్చెర్ల నియోజకవర్గ, వైసిపి మహిళా విభాగ అధ్యక్షురాలు గురాన. తిరుమల మానస లు మీటింగ్ అనంతరం దుశ్శాలువా తో సత్కరించారు.

గ్రామ పంచాయతీ కార్యాలయం, నరసన్నపేట

రేఖా నెంబర్ 138/2025-బి

తేది. 12.05.2025.

టెండర్ నోటీసు

శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలం, నరసన్నపేట గ్రామ పంచాయతి నందుదిగువ సుదహరించిన షెడ్యులు-1 నందు చూపబడిన సామగ్రి 2025-2026 ఆర్థిక సంవత్సరము కాలము నందు సప్లయి చేయుటకు టెండర్లు నిర్వహించబడును టెండరు దాఖలు చేయువారు టెండరు ధరావత్తు చెల్లించి తే.20-05-2025ది ఉదయం గం.11-00 నుండి మధ్యాహ్నం గం.1-00 వరకు గ్రామ పంచాయతి కార్యాలయం వద్ద యీ దిగువ సంతకం దారునిచే గాని లేదా వారి అనుమతి పొందిన ఇతర ఉద్యోగిచే గాని సీలు వేసిన టెండర్లు స్వీకరించబడును. స్వీకరించబడిన టెండర్లు అదేరోజు మధ్యాహ్నం గం.3-00లకు అప్పటికి హాజరైన టెండరుదారుల సమక్షంలోతెరువబడును మరియు షెడ్యుల్ టెండరుదారులు టెండరు షరతులకు లోబడి పాల్గొనవలెను.

షెడ్యూల్-1(టెండరు)

వ.నెం	పని/సామాగ్రి వివరములు	ఆర్థిక సంవత్సరము	సప్లయి చేయు కాలము	చెల్లించవలసిన టెండర్ ధరావత్తు
1)	పారిశుధ్య ట్రాక్టర్ నిర్వహణ సామగ్రి	2025-2026సం	15 రోజులు	రూ.500/-
2)	రక్షిత మంచినీటి పథకము నిర్వహణ సామగ్రి	2025-2026సం	15 రోజులు	రూ.500/-
3)	పబ్లిక్ బోర్ వెల్ రిపేరు సామగ్రి	2025-2026సం	15 రోజులు	రూ.500/-
4)	PHఆర్టికల్ సామగ్రి (బ్లీచింగ్, పొడి సున్నం, ఫినాయిల్)	2025-2026సం	15 రోజులు	రూ.500/-
5)	వీధి విద్యుత్ సామగ్రి	2025-2026సం	15 రోజులు	రూ.500/-
6)	Clamp Sets for LED lights (New poles)	2025-2026సం.	15 రోజులు	రూ.500/-

టెండర్లు ఎట్టి కారణము చూపి గాని, చూపకుండా గాని, వాయిద వేయుట గాని, తిరస్కరించుటగాని, పూర్తి అధికారం యీ గ్రామ పంచాయతికి, అందులకు సంబంధించిన అధికారులదై యుండును. పూర్తి షరతులు, ఇతర వివరములు కార్యాలయ పని వేళలయందు అడిగి తెలుసుకోవలెను.

// సం.// పల్లి ద్రాక్షాయణి
కార్యనిర్వహణాధికారి
(పంచాయతి కార్యదర్శి)
గ్రామ పంచాయతి, నరసన్నపేట.

బాలికల హక్కులపై అవగాహన కల్పించాలి

విశాలాంధ్ర - కవిటి : బాలికల హక్కులపై ప్రతీ ఒక్కరికీ అవగాహన కల్పించాలని సీడీపీవో పి.నాగరాణి అన్నారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని బిజీ పుట్టుగ, ఇద్దివాని పాలెం అంగన్వాడీ కేంద్రంలో 15 నుంచి 18 ఏళ్ల బాలికలకు కిశోర్ వికాసంపై బాలికలకు అవగాహన కల్పించారు. బాలికల హక్కులు రక్షణ, పిఓసిఎస్ఓ చట్టం గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్లు పల్లవి, కృష్ణవేణి, లక్ష్మీ, అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మితాహారం వేసవి నుండి ఉపశమనం : డాక్టర్ ఆర్.మల్లేశ్వరరావు

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : వేసవి తీవ్రత దృష్ట్యా ప్రతీ ఒక్కరూ విధిగా తగు జాగ్రత్తలు పాటించాలని రిమ్స్ మెడికల్ కాలేజీ ప్రొఫెసర్, శ్రీకాకుళం జిల్లా ప్రజారోగ్య వేదిక అధ్యక్షుడు డాక్టర్ ఆర్ మల్లేశ్వరరావు సూచించారు. మంగళవారం శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ శ్రీకాకుళం డిస్ట్రిక్ట్ 102 ఆధ్వర్యంలో వేసవి తాపానికి డిహైడ్రేషన్ నుంచి కాపాడుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు పై డాక్టర్ మల్లేశ్వర రావు కొన్ని సూచనలు చేశారు. అధిక రక్తపోటు, సుగర్ వ్యాధిగ్రస్తులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా తగినంత నీరు, చల్లని ప్రదేశాల్లో ఉండటం, బయటకు వెళ్ళే ముందు తలపై టోపీ ధరించడం, ఎక్కువ సమయం ఎండలో లేకుండా ఉండటం వంటి జాగ్రత్తలు పాటించాలని కోరారు.. ఫాస్ట్ ఫుడ్ మరియు మాంసాహారం వంటి వాటికి దూరంగా వుండాలని, తేలికైన దుస్తులు ధరించాలని, చల్లని నీటితో రెండు మూడు సార్లు స్నానం చేస్తే మంచిది అన్నారు. ప్రతీ ఒక్కరూ విధిగా రోజుకు నాలుగు నుండి ఐదు లీటర్ల నీరు తీసుకోవాలని, కాలుష్యం లేని స్వచ్ఛమైన నీరు మాత్రమే తీసుకోవాలని సూచించారు. వేసవి తీవ్రత దృష్ట్యా అరవై యేండ్ల దాటిన వారు అధిక ఎక్సర్ సైజులు చేయరాదని , వాకింగ్, జాగింగ్ తగ్గించాలని సూచించారు. చివరిగా ఆపరేషన్ సింధూరలో వీరమరణం పొందిన వీర జవాన్ మురళి నాయక్ కు శ్రద్ధాంజలి ఘటిస్తూ వారి ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. స్టార్ వాకర్స్ క్లబ్ కో ఆర్డినేటర్ శాసపు జోగినాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గేదెల ఇందిరా ప్రసాద్, పీజీ గుప్తా, గుడ్ల జగ్గారావు, డాక్టర్ జి. నారాయణ రావు, గుడ్ల గోపాలరావు, డాక్టర్ బొడ్డేపల్లి ప్రసాద్ రావు, సుగంధం సంజీవ రావు, గేదెల లక్ష్మీ, నందిగామ కామేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

నీరుగారిన ఆర్థిక సంఘం నిధులు...రెండున్నర ఏళ్ళ క్రితం ప్రారంభోత్సవం

విశాలాంధ్ర - ఆమదాలవలస : ప్రజాస్వామ్యబద్ధంగా పాలన జరిపి గ్రామ పట్టణాల ను అభివృద్ధి పథంలో నడిపిస్తారన్న ఉద్దేశంతో ఐదేళ్లకొకసారి జరిగే ఎన్నికలలో ప్రజలు నాయకుడిని ఎన్నుకొని చట్టసభలకు పంపిస్తారు. అటువంటి నాయకుడు ప్రజలకు ప్రజాధనానికి కాపలాదారునిగా ఉండి సంరక్షిస్తూ పారదర్శకమైన పాలనను అందిస్తారు. అటువంటి నాయకుల ద్వారా గ్రామాల్లో పట్టణాల్లో అభివృద్ధి పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుంది. ఆ ప్రాతిపదికన ఆముదాలవలస పురపాలక సంఘం అభివృద్ధికి గత ప్రభుత్వ హయాంలో 15 ఆర్థిక సంఘం నిధులు విడుదలైనాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు శానిటేషన్ పనుల నిర్వహణ, డంపింగ్ యార్డ్, శానిటేషన్ వాహనాల సంరక్షణ భవనాల నిర్మాణానికి కేటాయించారు. జనవరి 9 వ తేదీ 2023లో 37.20 లక్షల నిధులతో శానిటేషన్ వాహనాల సంరక్షణ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అయితే భవనం 50శాతం నిర్మాణం జరిగింది. ఆ భవన గుత్తేదారు అప్పటి ఇంజనీరింగ్ అధికారులు మధ్య జరిగిన లావాదేవీలలో తేడాల కారణంగా ని ర్మాణ పనులు నిలిచిపోయాయి అన్న ఆరోపణలు ఉన్నాయి. ఇది ఇలా ఉండగా ఆ భవన నిర్మాణానికి ముందు ఆ స్థలంలో రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగుల నిలయం నిర్మాణం జరిగింది. అప్పటి ప్రభుత్వ నాయకులు ఆ స్థలాన్ని వారికి దక్కనివ్వకుండా చేసే పనిలో భాగంగా ఆ ప్రాంతంలో భవన నిర్మాణానికి నాయకులు ఉప క్రమించారు. దీంతో నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించారు. ఏం జరిగిందో ఏమో కానీ పనులను సగములో నిలుపు చేసి పక్కనే ఉన్న భవనం వారు అడ్డుకుంటున్నారన్న ప్రచారం జరిగింది. భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉండడం వెనుక శ్రీకాకుళంలోని సంబంధిత ఇంజనీరింగ్ అధికారి హస్తం ఉందన్న ఆరోపణలు ఉన్నాయి. నిజానికి ఈ భవన నిర్మాణానికి గతంలో నిర్మాణం చేపట్టిన వ్యా యామం మండలి స్థలాన్ని కూడా ఈ భవనానికి వాడుకున్నారు. అయినప్పటికీ వ్యాయామ మండలి వారు వివాదం చేశారంటూ పనులు నిలిపి చేశారు. శంకుస్థాపన జరిగి రెండున్నర సంవత్సరాలు అవుతున్న పనులలో నాణ్యతను పరిశీలించ కుండా ఇక్క డ ఇంజనీరింగ్ అధికారులే కాంట్రాక్టర్ల అవతారం ఎత్తడంతో ఈ పరిస్థితి దాపురించిందన్న విమర్శలు ఉన్నాయి. ఈ భవన నిర్మాణం ఆద్యాంతం వివాదాల నడుమే కొనసాగింది. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభు త్వం సమస్యను పరిశీలించి ప్రజాధనం వృధా కాకుం డా భవన నిర్మాణ పనులు పూర్తి చేసి మున్సిపాలిటీ అభివృద్ధికి చర్యలు తీసుకోవలసి ఉంది.

పోస్ట్ వాక్సినేషన్ సీరం నమూనాల సేకరణ

విశాలాంధ్ర - మందస : కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం ద్వారా మార్చ్ మరియు ఏప్రిల్ నెలలో రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని మందస పశు వైద్యాధికారి దువ్వాడ శ్రీకాంత్ తెలిపారు. టీకాల క్షేత్రస్థాయి నిర్వహణను తెలుసుకోవడానికి ప్రతి డివిజన్ నుంచి రేండంగా ఒక గ్రామాన్ని ఎంపిక చేస్తామన్నారు. ఎంపిక చేసిన గ్రామంలో గల పశువుల నుంచి రక్త నమూనాలను సేకరించి ల్యాబ్‌లో పరీక్షించడం ద్వారా క్షేత్రస్థాయి టీకాల నిర్వహణను నిర్ధారించడం జరుగుతుందన్నారు. ఈ ప్రక్రియలో భాగంగా మంగళవారం మందస మండలం అల్లిమెరక గ్రామాన్ని రేండంగా ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. ఈ ఎంపిక చేసిన గ్రామంలో డా. పి రమాదేవి, అసిస్టెంట్ డైరెక్టర్, క్వాలిటీ అనలిటికల్ లేబరేటరీ, విశాఖపట్నం మరియు డా. ఆర్. కిషోర్, అనిమల్ డిసీస్ డయాగ్నొస్టిక్ లేబరేటరీస్, శ్రీకాకుళం ఆధ్వర్యంలో రక్తనమూనాలను సేకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మందస మండల పశువైద్యాధికారి డా. దువ్వాడ శ్రీకాంత్ సిబ్బంది లక్ష్మి, సంతోషి, శ్రీను మరియు తిరుపతి పాల్గొన్నారు.

మొక్కలు నాటండి.. పర్యావరణాన్ని కాపాడండి

వాకర్స్ క్లబ్ అధ్యక్షులు పండిత రాజేంద్ర

విశాలాంధ్ర - పలాస : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని వాకర్స్ క్లబ్ అధ్యక్షులు పండిత రాజేంద్ర అన్నారు. క్లబ్ సభ్యుడు బెల్లాల ప్రమోద్ కుమారుడు ధన్విన్ జన్మదినం సందర్భంగా మంగళవారం పలాస ముత్యాలమ్మ కోనేరు నెహ్రూ పార్కులో మూడు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి తాపానికి చెట్లు నీడ ఎంతో ఉపశమనం కలిగిస్తాయని, భవిష్యత్తు తరాల కోసం ఇప్పుడు నాటిన మొక్కలు తిరిగి పెద్దవే వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. నాటిన మొక్కలు సంరక్షణ కొరకు మూడు వేల రూపాయలను ప్రమోద్ అంద జేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో క్లబ్ మెంబర్స్, అధ్యక్షులు పండిత రాజేంద్ర, దడియాల నర సింహులు, లండ నాగరాజు, వందర బుజ్జి, రాము పాత్రో, సంతోష్ పాత్రో, పరమేశ్వరి మోహన్‌రావు, రామారావు, మోహన్‌రావు మాస్టర్, నీలిమ తేజ మధులకు సభ్యులు పాల్గొన్నారు.

కొత్తమ్మ తల్లికి జనసైనికులు ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - పలాస : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు దేశ సైన్యానికి, నాయకత్వానికీ దైవ బలం చేకూరాలని కాంక్షిస్తూ దేశ వ్యాప్తంగా ఉన్న ప్రముఖ క్షేత్రాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక పూజల్లో భాగంగా మంగళవారం కోటబొమ్మాళి మండలం శ్రీ శ్రీ శ్రీ కొత్తమ్మతల్లి ఆలయంలో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు శ్రీ పిసిని చంద్రమోహన్ నేతృత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేశం కోసం పోరాడుతున్న సైన్యానికి నైతిక మద్దతు ఇచ్చే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం ద్వారా సైన్యానికి, ప్రధాని మోదీకి ఉత్తరాంధ్ర ఇలవేల్పు శ్రీ కొత్తమ్మ తల్లి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలాస నియోజకవర్గ నాయకులు శ్రీ కోత పూర్ణ చంద్రరావు, సంతోష్ వండ, అట్టాడ వాసు, మేడిశెట్టి నరసింహ మూర్తి, కిల్లి బాలకృష్ణ, బతకల భాస్కరరావులు పాల్గొన్నారు.

బారువ టీడీపీ అధ్యక్షుడిగా 'మద్దు'

విశాలాంధ్ర - సోంపేట : సోంపేట మండలం బారువ మేజర్ పంచాయతీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షునిగా సీనియర్ నేత మద్దు గురుమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం రాత్రి సోంపేట మండల టీడీపీ అధ్యక్షుడు మద్దిల నాగేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సూరాడ చంద్రమోహన్ ఆధ్వర్యంలో ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఉపాధ్యక్షుడుగా తోట తాతయ్య, ప్రధాన కార్యదర్శిగా దున్న సత్యనారాయణ, కార్యనిర్వాహక కార్యదర్శులుగా గౌరకల నాగేశ్వరరావు, ఆనింగి జగదీష్, కాళ్ల జేజేరావు, కార్యదర్శులుగా ఎం.జోగారావు, వై.నేతాజీ, బి.బలరాం, కోశాధికారి డి.మహేష్ ఎన్నికయ్యారు.

నాటుసారాపై డిప్యూటీ కమిషనర్ సమీక్ష

విశాలాంధ్ర - సోంపేట : నవోదయం 2లో భాగంగా నాటుసారా నిర్మూలనపై సోంపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గల దత్తత గ్రామాల అధికారులతో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ బి.శ్రీకాంత్ మంగళవారం సమీక్షించారు. సోంపేట ఎక్సైజ్ కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు. నాటుసారా నిర్మూలనకు తీసుకోవల్సిన చర్యలను వివరించారు. ఎట్టి పరిస్థితిలోను నాటుసారా విషయంలో అలసత్వం వహించవద్దని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ కె.బేబీ తదితరులు పాల్గొన్నారు.

కోట్లాది రూపాయల సంత... కనీస సౌకర్యాలు కరువు

విశాలాంధ్ర - జలుమూరు : జలుమూరు, కోటబొమ్మాళి మండల సరిహద్దులో జిల్లాలో అతిపెద్ద వారపు సొంతగా పేరుగాంచిన నారాయణ వలస సంతలో కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడం జిల్లా నలుమూల నుంచి వచ్చే వ్యాపారులు అనేక ఇక్కట్లు పడుతున్నారు. ప్రతివారు వందల రూపాయలు చెల్లిస్తున్నామని ఈ సంతకు సుమారు కోటి రూపాయల వరకు పాట పడుతున్నారని సంతనుండి ప్రభుత్వానికి వెళ్లే ఆదాయం అధికార యంత్రాలను ఖర్చు చేయడమే తప్ప సొంత అభివృద్ధిని మరిచిపోతున్నారని పలు విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని సంవత్సరాల క్రితం శ్రీకాకుళం విజయనగరం జిల్లాలలో అతిపెద్ద సంతగా పేరుగాంచిన నారాయణ వలస గురువారం సంత రోజురోజుకు దిగజారి పోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. కనీసం కాలినడకన వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామని వ్యాపారులు వాపోతున్నారు. ఇక్కడ కాంట్రాక్టు గాని అధికారులు గాని సంత కోసం కనీసం లక్షల రూపాయల్లో ఖర్చు చేసి రహదారులు కూడా వేయకపోవడంపై వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు నియోజకవర్గ శివారి గ్రామం నారాయణ వలస సంత సమస్యలు పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

శరవేగంతో బైథిలాపురం వంతెన నిర్మాణ పనులు

విశాలాంధ్ర - జలుమూరు : సారవకోట మండలం బైదిలాపురం వంశధార ప్రధాన ఎడమ కాలువపై కూలిపోయిన వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మాణకోసం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకొని వెళ్లి ప్రజలకు రైతులకు ఎంతో ఉపయోగకరమైన ఈ వంతెన నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని పట్టు పట్టిన స్థానిక శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి కృషి అభినందనీయమని సారవకోట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కత్తిరి వెంకటరమణ అన్నారు. వైఎస్ఆర్ ప్రభుత్వ పాలనలో ఈ వంతెన నేల కూలిందని ఇది రైతులకు ప్రజలకు ఎంతో ఉపయోగకరమైందని దీని నిర్మాణం చేపట్టాలని ఆనాటి రైతులు ఆనాటి ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ కు కోరగా ఎన్నికల ముందు ఉప ముఖ్యమంత్రి రెవిన్యూ మంత్రి హోదాలో వచ్చి అట్టహాసంగా శంకుస్థాపన చేశారని రైతులన్నారు. పదవి పోయి ప్రభుత్వం మారిన తరువాత దాని నిర్మాణానికి ఎవరు కృషి చేయలేదని 2024లో జరిగిన ఎన్నికల్లో శాసనసభ్యులుగా విజయం సాధించిన బగ్గు రమణమూర్తి పట్టుదల కృషి మేరకు కోటి 33 లక్షల రూపాయలు మంజూరు చేయించి నేడు పనులు శరవేగంతో జరుగుతున్నాయని కత్తిరి వెంకటరమణ అన్నారు. ప్రజలతో ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులు ప్రజా సమస్యల పరిష్కారం దిశలో ఉండాలని దానికి నిదర్శనం బగ్గు రమణ మూర్తి అని అన్నారు.

పుణ్యక్షేత్రం శ్రీముఖలింగం పర్యాటక కేంద్రం అయ్యేనా..!



విశాలాంధ్ర - జలుమూరు : రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రంలో ఒకటైన జలుమూరు మండలం శ్రీముఖలింగం పర్యాటక కేంద్రంగా ప్రభుత్వం మంజూరు చేసేనా అని పలువురు భక్తులు స్థానికులు అభిప్రాయ వ్యక్తపరిచారు. దేశ నలుమూలల నుండి అనేకమంది భక్తులు ఎక్కడికి వచ్చి స్వామిని సందర్శించి వారి బాగోగుల కోసం కోరుకుంటూ వెళుతుంటారు. శతాబ్దాల చరిత్ర కలిగిన శ్రీముఖలింగా క్షేత్రం పురాణ ప్రాచీన చరిత్ర కలిగినది. ఈ ఆలయ చరిత్ర ఇక్కడ శిల్ప సంపద ఎంతో అపూర్వం ఇటువంటి మహా పుణ్యక్షేత్రాన్ని శ్రీకాకుళం జిల్లాలో అనేకమంది పాలకులు స్వామిని సందర్శించిన ప్రతి క్షణం ఈ పుణ్యక్షేత్రాన్ని అద్భుతంగా చేసి చూపిస్తామని అనేక మంది పాలకులు అనేక సమయాల్లో ప్రకటించారు. కొన్ని కోట్ల రూపాయలు విడుదల చేస్తున్నామని ప్రభుత్వం ప్రకటించినా నేటికీ దాని చిరునామా లేదు. ఈ క్షేత్రాన్ని అనేకమంది మన రాష్ట్ర ముఖ్యమంత్రి దేశ విదేశాల నుండి వచ్చిన భక్తులు ఉన్నత పదవుల్లో ఉన్న అధికారులు సందర్శించిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. అటువంటి పవిత్ర పుణ్యక్షేత్రాన్ని కనీస మౌలిక సదుపాయాలు లేకుండా ఉన్నదంటే అది భగవంతుడికి శాపమా భక్తుల యొక్క పాపమా నాయకుల నిర్లక్ష్యమా అనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. అభివృద్ధి చేసి భావితరాల జీవితాలకు బాసటగా నిలవాలని పలువురు కోరుతున్నారు.

ప్రకృతి వ్యవసాయ విధానాలే శరణ్యం

విశాలాంధ్ర - సంతబొమ్మాళి : ఆరోగ్యవంతమైన అహారోత్పత్తికి రాబోవు కాలంలో ప్రకృతి వ్యవసాయ విధానాలే శరణ్యమని సంతబొమ్మాళి మండల వ్యవసాయాధికారి రాళ్లపేట అప్పారావు అన్నారు. మండలంలోని గోవిందపురం రైతుసేవాకేంద్రం పరిధి నవరపేట గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో భాగమైన నవధాన్యాల సాగుపై చర్చా కార్యక్రమంలో పలుసూచనలు చేశారు. వినియోగదారుల్లో రసాయన రహిత సేద్యపు ఉత్పత్తులపై మక్కువ పెరుగుతున్న దృష్ట్యా, ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు గిరాకీ రాబోతుందని తద్వారా ప్రకృతి వ్యవసాయం లాభసాటి కాబోతోందని అన్నారు. మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి రెడ్డి అప్పన్న మాట్లాడుతూ గ్రామం నుండి ప్రకృతి వ్యవసాయం చేయుటకు రైతులు ముందుకు రావడం శుభపరిణామం అన్నారు. గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విధానాలు విజయవంతంగా ఆచరిస్తున్న అభ్యుదయ రైతులు తెలుగు భీమారావు, గొండు కన్నయ్య లను సన్మానించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ప్రతినిధులు కింజరాపు ఉష, తంగి విజయ, తంగి వేణమ్మ వ్యవసాయ సహాయకుడు వాదాల బాలకృష్ణ పాల్గొన్నారు.

కొబ్బరి తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి

ఉద్యాన పరిశోదన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రాజశేఖర్

విశాలాంధ్ర - కవిటి : కొబ్బరి చెట్లకు సోకే తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఉద్యాన పరిశోదన కేంద్రం పెద్దపేట శాస్త్రవేత్త డాక్టర్ రాజశేఖర్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన బల్లిపుట్టుగ, బొరివంక గ్రామాల్లోని కొబ్బరి తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొబ్బరిలో వచ్చే సర్పిలకర తెల్లదోమ, గ్యానోడెర్మ, ఎర్రముక్కు, నల్లముట్టు వంటి తెగుళ్ల నివారణ పద్ధతులను వివరించారు. అలాగే తోటల్లో పచ్చిరొట్ట ఎరువులను విరివిగా వాడాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బార్ల చినబాబు, విహెచ్ఎలు జగదీష్, సంతోష్ రెడ్డి, ఎంపీఈవోలు లలిత, రైతులు వజ్జ గోపి, పి.సందీప్, బి. బాబురావు, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వంట గ్యాస్ వినియోగదారులకు నిరాశ...

డబ్బులు చెల్లించాలని ఆశతో ఎదురు చూపులు..!

విశాలాంధ్ర - పలాస/మందస : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడితే సూపర్ సిక్స్ పథకాల్లో ఒకటైన ఉచిత వంట గ్యాస్ పంపిణీ పథకం అమలు చేస్తామన్న ప్రభుత్వం మాటను నిలబెట్టుకుంది. తెలుపు రంగు రేషన్ కార్డు కలిగి వంట గ్యాస్ కనెక్షన్లు ఉన్న వినియోగదారులకు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందజేస్తామని వంట గ్యాస్ ఏజెన్సీ నుంచి నాలుగు నెలలకు ఒకసారి వినియోగదారుడు గ్యాస్ పొందవచ్చనే నిబంధన పెట్టింది. వినియోగదారుడు విడిపించిన తర్వాత ప్రభుత్వం గ్యాస్ డబ్బులు వారి బ్యాంకు ఖాతాలకు జమ చేస్తామని ప్రకటించింది.అయితే వినియోగదారులు గ్యాస్ ను విడిపించిన తర్వాత తమ ఖాతాల్లోకి డబ్బులు జమ కావటం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వంటగ్యాస్ కనెక్షన్ల తో పాటు తెలుపు రేషన్ కార్డు కలిగి ఉన్న వినియోగదానికి ఏడాదికి మూడు వంటగ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని హామీ ఇచ్చింది. దీంతో వంట గ్యాస్ వినియోగిస్తున్న వినియోగదారులు ఎంతో సంబరపడ్డారు. గత సంవత్సరం ఆఖరున మొదటి విడతగా ఉచిత గ్యాస్ బుకింగ్ కి ఆఫర్ ఇచ్చారు. వినియోగదారులు వంట గ్యాస్ బుక్ చేసుకున్నారు. కానీ ఉచిత గ్యాస్ కి సంబంధించి డబ్బులు మాత్రం గ్యాస్ వినియోగదారులందరికి బ్యాంకు ఖాతాలకు డబ్బులు ప్రభుత్వం జమ చేయలేదు. అప్పట్లోనే వినియోగదారులు నిరాశ చెందారు.మళ్లీ ఈ ఏడాది ఏప్రిల్ నెలలో ఉచిత గ్యాస్ బుక్ చేసుకోవాలని ప్రభుత్వం వినియోగదాలకు ఆఫర్ ఇచ్చింది.వంట గ్యాస్ కోసం వినియోగదారులు బుక్ చేశారు. గ్యాస్ బుక్ చేసుకున్న వినియోగదారులకు గ్యాస్ ఏజెన్సీలు గ్యాస్ దిమ్మలు అందించారు. గ్యాస్ దిమ్మలు అందుకున్న వెంటనే ఒకటి రెండు రోజుల్లో వినియోగదారుని బ్యాంక్ కు గ్యాస్ డబ్బులను ప్రభుత్వం జమ చేయాలి. ఏప్రిల్ నెల ముగిసి పోయి మే నెల సగం రోజులవుతున్న ఉచిత గ్యాస్ డబ్బులు ఇంత వరకు వినియోగదారుల ఖాతాలకు జమ కాకపోవడంతో వినియోగదారులు నిరాశ చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి తమ ఖాతాలకు ఉచిత గ్యాస్ డబ్బులు జమ చేయాలని గ్యాస్ వినియోగదారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

అమ్మతల్లిని పుర వీధుల్లో ఊరేగించిన భక్తులు

ముగిసిన గ్రామదేవత ఉత్సవాలు

విశాలాంధ్ర - నందిగాం : మండలం కొత్తఅగ్రహారంలో కొలువైయున్న పాలపోలమ్మ తల్లి గ్రామ దేవత ఉత్సవాలు ముగిశాయి. మూడు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలులో భాగంగా చివరి రోజైన మంగళవారం దేవతను రథంపైన గ్రామ పుర వీధుల్లో ఊరేగించి ఆలయానికి చేర్చి మొక్కులు చెల్లించుకున్నాడు. ముగ్గురాటలతో చల్లదను చేశారు. వలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. సంబరాలను చూసేందుకు బంధువులు స్నేహితులతో గ్రామం కిటకిట లాడింది.

కోటబొమ్మాళి జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా అప్పన్న

విశాలాంధ్ర - సంతబొమ్మాళి/కోటబొమ్మాళి : కోటబొమ్మాళి జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ గా అరంగి అప్పన్న బాధ్యతలు స్వీకరించారు. ఇదే కాలేజీ లో గతంలో తొమ్మిది సంవత్సరాలు పాటు లెక్చరర్ గా పనిచేసారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత అప్పన్న కు విద్యారంగంలో అనుభవం ఉంది. సంతబొమ్మాళి మండలం బోరుభద్ర గ్రామానికి చెందిన ఈయన విజయ నగరం, శ్రీకాకుళం జిల్లాల్లో అధ్యాపకులుగా పని చేసిన అనుభవం ఉంది. ఈ మేరకు మంగళవారం భాధ్యతలు స్వీకరించిన అప్పన్నకు గతంలో ఉన్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు ఘనంగా సన్మానం చేసారు.

22ఎ సమస్యపై స్వామిత్వ సర్వే

తహాశీల్దార్ అప్పలస్వామి

విశాలాంధ్ర - సోంపేట : సోంపేట పట్టణంలోని మహదేవిపేట, సూర్యవాస, పట్టు శాలివీధి, జలారీవీధుల్లో నెలకొన్న 22ఎ సమస్య దాదాపు పరిష్కారమైందని త్వరలో స్వామిత్వ సర్వే కూడా నిర్వహిస్తామని తహాశీల్దార్ అప్పలస్వామి పేర్కొన్నారు. ఆయన మంగళవారం మండల సర్వేయర్ రాజేశ్వరరావు, డిటి మహేశ్వరరావు, ఇతర రెవెన్యూ సిబ్బందితో కలిసి బాధితులతో మాట్లాడారు. ఎటువంటి ఆందోళన చెందవద్దని అన్నారు.

వంచుల పంచాయితీ గ్రామ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక

విశాలాంధ్ర - జీకే వీధి : గూడెం కొత్తవీధి మండలం వంచుల పంచాయితీ టిడిపి గ్రామ కమిటీని టిడిపి మండల ప్రధాన కార్యదర్శి పోత్తూరు కొండలరావు, మండల టిడిపి యూత్ అధ్యక్షులు ముర్ల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. మంగళవారం జరిగిన చెరపల్లి గ్రామం లో సమావేశం నిర్వహించి గ్రామ కమిటీ అధ్యక్షులు గా ముర్ల భూపతి ను అధ్యక్షులుగా, గెమ్మల సత్యనారాయణ ను ఉపాధ్యక్షులుగా, కొడబాల నారాయణరావు ను ప్రధాన కార్యదర్శులుగా, అరడ గబ్రియల్ ను కోశాధికారిగా, వంతల అరుణకుమార్, ముర్ల లక్ష్మణరావు, కోహూరు సతీష్ ను కార్యదర్శులుగా, సహాయ కార్యదర్శులుగా రిమల నారాయణరావు, కంకిపాటి మల్లు పడాల్, బూడిద శంకర్రావు కార్యవర్గ సభ్యులుగా కొర్ర రామారావు, మర్రి సత్యనారాయణ, కట్టుపల్లి రాంప్రసాద్, వనపల రామారావు,పూజారి వెంకటరమణ, సల్లంగి నూకరాజు, బూడిద సోమలింగం, బూడిద బాలకృష్ణ,అరడ వెంకటేశ్వర్లు లను ఎన్నుకోవడం జరిగింది. పంచాయితీ లో ఎటువంటి సమస్యలు ఉన్న ఆ సమస్యల పరిస్కారం కోసం అందరం కలసి కట్టుగా నిర్ణయం తీసుకుంటామని ఎన్నికైన సభ్యులందరూ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ టిడిపి నాయకులు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

విశాలాంధ్ర - జి.మాడుగుల : మండలంలోని కె.కోడాపల్లి సమీపంలో మంళవారం తెల్లారి సమయంలో జీపు బోల్తా పడిన సంఘటనలో చింతపల్లి మండలం మండల చవుడుపల్లి పంచాయతీ చిన్నకొత్తూరు గ్రామానికి చెందిన సీదరి లక్ష్మి (30) అక్కడికక్కడే మృతి చెందింది. కుటుంబీకులు తెలిపిన వివరాలు మేరకు..పాడేరులో జరుగుతున్న మోదమాంబ జాతరకు భార్యభర్తలు కలిసి వెళ్లి తిరుగు ప్రయాణంలో మంగళవారం తెల్లరి సమయంలో ఓ ప్రైవటే జీపు లో వస్తుండగా కె.కోడావల్లి వద్ద జీపు బోల్తాకొట్టింది. ఈ ప్రమాదంలో సీదరి లక్ష్మి మృతి చెందగా భర్త రంగరావుకు తీవ్రగాయాలైంది. క్షతగాత్రుడు పాడేరు జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతురాలుకు ఇద్దరి పిల్లలు ఉన్నారు. కుటుంబీకులు ఇచ్చన ఫిర్యాతో స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసస్తున్నారు.

రైతు సేవ కేంద్రంలో రైతులు వివరాలు నమోదు చేసుకోవాలి

విశాలాంధ్ర - జీకే వీధి : అన్నదాత సుఖీభవ పథకం కోసం ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ సచివాలయం రైతు సేవా కేంద్రంలో ఈ నెల 20 లోగా రైతులు వివరాలను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మధుసూదన్ రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ కోసం ఆర్ఓఎఫ్ఆర్, రెవెన్యూ పట్టాలను కలిగిన రైతులు కూడా అర్హులన్నారు. మండలంలో గ్రామ సచివాలయాల లో రైతు సేవా కేంద్రాల్లో ఈనెల 20వ తేదీ లోపు రైతులు వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకంని రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

కిషోర్ బాలికల పరిరక్షణే మా లక్ష్యం

ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిణి లక్ష్మీదేవి

విశాలాంధ్ర - జీకే వీధి : జీకే తత వేసవి సెలవుల్లో బాలికలు తల్లిదండ్రుల పర్యవేక్షణలో ఉండడం వారి రక్షణకు ఉత్తమ మార్గమని జీకే వీధి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణి లక్ష్మీదేవి పేర్కొన్నారు. మండలంలోని పాము రాయి, వంది రాయి కొత్త గూడెం గ్రామాల అంగన్వాడి కేంద్రాల్లో కిషోర్ బాలికల కోసం నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని ఆమె మంగళవారం సందర్శించి, అక్కడి రికార్డులు, కార్యకలాపాలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 11 ఏళ్ల నుంచి 19 ఏళ్ల బాలికల శారీరక, మానసిక అభివృద్ధికి అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించడమే తమ లక్ష్యమని తెలిపారు. బాల్యవివాహాల నిర్మూలనకు సమాజంలోని ప్రతి ఒక్కరూ చొరవ చూపాలని సూచించారు. విద్యాబుద్ధులు నేర్చుకునే హక్కు ప్రతి చిన్నారికీ ఉందని, బడి బయట ఉన్న పిల్లలను తల్లిదండ్రులు పాఠశాలలకు పంపే బాధ్యత తీసుకోవాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ వలసమ్మ, మోహిని, రామలక్ష్మి, మహిళ సంరక్షకురాలు శాంతి, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.